
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త







# రెండో విడతకు రెడీ



**నేడు 165 పంచాయతీలలో పోలింగ్**

**తలపడుతున్న 499 మంది సర్పంచ్ అభ్యర్థులు**

**1306 వార్డు స్థానాల్లో 3,508 మంది పోటీ**

**13 మంది సర్పంచ్‌లు, 1,540 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం**

**30 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై డేగ కన్ను**

**రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** ఈనెల 14న జరగనున్న రెండవ విడుత పంచాయతీ ఎన్నికలకు జిల్లాలో రంగం సిద్ధమైంది. పోలింగ్‌కు సంబంధించి అధికార యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లోను, కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించి అమన్‌గల్, తలకొండపల్లి, కడ్తాల్ మండల్లాలోనూ జరిగే సంగ్రామంలో అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. జిల్లాలో 526 పంచాయతీలు ఉండగా మొదటి విడతలో 172 పంచాయతీలకు పోలింగ్ జరిగింది. రెండో విడతగా ఆదివారంనాడు 165 పంచాయతీలకు ఎన్నిక జరగనుండగా 499 మంది తలబడుతున్నారు. 13 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, 8 గ్రామ పంచాయతీల్లో 1,540 వార్డులకు 232 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1306 వార్డు స్థానాల్లో 3,508 మంది పోటీపడుతున్నారు.

రెండో విడత ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో 2003 మంది ప్రిసైడింగ్ అధికారులను, 588 మంది ఓపీవోలను, సున్నితమైన నియమించారు. 30 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 35 మంది మైక్రో అబ్జర్వర్‌లను ఏర్పాటుచేశారు. సంబంధిత మండలాలకు పోలింగ్ సామాగ్రిని వాహనాల్లో చేర్చారు. రవాణా సదుపాయం కోసం నోడల్ అధికారి అయిన డీటీఓ, ఆర్ టీ ఓ రూట్ మ్యాప్‌ల ప్రకారం 2వ విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల నిమిత్తం రవాణా సదుపాయంను సిద్ధం చేసి వాహనాలను ఏర్పాటు చేశారు.

# ఎన్నేళ్లకెన్నేళ్లకు..

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఒకటా, రెండా ఏకంగా పదేళ్ల నిరీక్షణ. కానీ పాలకుల ఉదాసీన వైఖరి వల్ల రోడ్డుకు పట్టిన గ్రహణం వీడలేదు. పైగా అనవసరమైన రాజకీయాల.. ఫలితంగా రోజు రోజుకు జరిగిన ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎట్టకేలకు తాండూరు ఎమ్మెల్యే బీ.మనోహర్‌రెడ్డి చొరవతో రోడ్డుకు పట్టిన గ్రహణం వీడిపోయింది. తాండూరు నుంచి రాజధాని హైద్రాబాద్ రహదారి పనులు చురుకుగా సాగుతున్నాయి. రూ.50 కోట్ల అంచనాలతో తాండూరు నుంచి పెద్దేముల్ మండలం మంచన్‌పల్లి వరకు పూర్తి కావస్తోంది. మొదటి లేయర్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.



మూడు మాసాల క్రితం రోడ్డు దుస్థితి ఇదీ..



మొదటి లేయర్ తర్వాత మెరిసిపోతున్న రహదారి

**తాండూరు-రాజధాని రహదారి కోసం పదేళ్ల నిరీక్షణకు తెర**

**మంచన్‌పల్లి వరకు రూ.50 కోట్ల అంచనా వ్యయం**

**రూ.15 కోట్ల వ్యయంతో మొదటి లేయర్ పూర్తి**

**నరకప్రాయం నుంచి సుఖ ప్రయాణానికి సుగమం**

**సిఎం వరకూ వెళ్లిన రోడ్డు పంచాయితీ**

**ఇద్దరు బడా కాంట్రాక్టర్లను ఒప్పించి ముందుకు సాగేలా ఎమ్మెల్యే మనోహర్ కృషి**

**ఎమ్మెల్యే చొరవపై జనం హర్షం**

మొన్నటి వరకు కంకర, గుంతల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిన విషయం తెలిసిందే. పలుమార్లు 'వార్త' దినపత్రిక ప్రత్యేక కథనాలు వెలువరించింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పందించిన తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లా డి రూ.50 కోట్ల కొత్త నిధులు మంజూరు చేయించారు. అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రూ.15 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 2 కిలోమీటర్లు మినహా ఫస్ట్ లేయర్ పనులు దాదాపు పూర్తి చేశారు. మంచన్‌పల్లి నుంచి దుగ్గా పూర్ వరకు పదేండ్ల క్రితం నిర్మించిన రోడ్డు నాణ్యతాయుతం లేకపోవడం వల్ల చిక్కుల వచ్చాయి. సాంకేతికపరంగా కొత్త అంచనాలు రూపొందించాల్సి ఉన్న దని తెలిసింది. రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ల నిర్ణయం తర్వాత మిగిలి పోయిన 2 కిలోమీటర్ల పనులు కూడా చేపట్టనున్నారు. దీని తర్వాత మిగిలిన 2 లేయర్ల పనులు చేపట్టనున్నారు. ఈ రోడ్డు పూర్తి చేసేందుకు మరో రెండు నెలలు పట్టవచ్చని భావిస్తున్నారు. ఇన్నాళ్లూ గతుకుల రోడ్డుపై ప్రయాణించలేక నానా అవస్త లు పడిన వాహనదారులు ప్రస్తుతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఎమ్మెల్యే రహదారి పనులు పూర్తి చేయిస్తున్నారని అంటు న్నారు.

**ఎమ్మెల్యేలకే చుక్కలు చూపించిన కాంట్రాక్టర్లు**

సినిమా కథల మాదిరిగానే తాండూరు-వికారాబాద్ రోడ్డుకూ తెర వెనక ఓ కథ ఉంది. గతంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. 2014లో మంత్రి మహేందర్‌రెడ్డి ఈ రోడ్డుకు రూ.55 కోట్లు మంజూరు చేయించారు. అప్పటి కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు అర్ధంతరంగా వదిలేశారు. అప్పటి నుంచి దీనిపై ఎవరూ పట్టించుకోలేదు. 2023లో గెలుపొందిన మనోహర్‌రెడ్డి వికారాబాద్ రోడ్డు పూర్తి చేయించాలని సంకల్పించారు. కానీ అనేక అవంతరాలు ఎదురైనారు. ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధులకే చుక్కలు చూపించారు. కానీ మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు పలుమార్లు రోడ్డు పంచాయతీ వెళ్లింది. 2024 అక్టోబరులో రీటెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టర్లు టెండర్ వేసేందుకు వెనకంజ వేశారు. వారికి అనేక రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది. మరోసారి సీఎం దృష్టికి వెళ్లింది. ఎట్టకేలకు వికారాబాద్ ప్రాంతానికి చెందిన ఇద్దరు బడా కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే మనోహర్ ఒప్పించి టెండర్ వేయించారు. అదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన మరో కాంట్రాక్టర్

మిగతా 2లో

# బిజినెస్‌మెన్‌లు అవ్వండి

**ఎదుటి వారి సంతోషంలో మన సంతోషాన్ని చూసుకోవాలి**

**అణగారిన వర్గాలకు చేయూత ఇవ్వడంలోనే తృప్తి**

**విద్యార్థులకు గవర్నర్ ఉద్బోధ**





ఐపిఈ స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**శామీర్‌పేట, డిసెంబరు 13, ప్రభాతవార్త :** యువ విద్యార్థులు భవిషత్‌లో పారిశ్రామికవేత్తలు కావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని ఇన్స్ స్టూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైసెస్ (ఐపిఈ) కళాశాల స్నాతకోత్స వం-2025 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు పట్టాలను ప్రదానం చేశారు. ఐపిఈలో మొత్తం ఐదు వందల ముప్పై మంది ఉత్తీర్ణత సాధించటంతో వారికి పట్టాలు ఆయన అందజేశారు. ఈ సందర్భంగ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ యువ విద్యార్థులదే భవిషత్ అని సామాజిక మాద్యమాలు వినియోగించుకుని అట్టడుగున ఉన్న ప్రజలను అభివృద్ధి పథంలోకి

మిగతా 2లో



జీయర్ స్వామి ఆశీస్సులు పొందుతున్న ముచింతల్ నూతన సర్పచి సుభాష్

## ప్రమాణ స్వీకారోత్సవానికి సమాయత్తం

**ఏర్పాట్లలో పంచాయతీ కొత్త పాలకవర్గాలు**

**రంగారెడ్డి (శంషాబాద్), డిసెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరిగిన తొలి విడత స్థానిక ఎన్నికలలో భాగంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ప్రమాణస్వీకారం ఉత్స వానికి సన్నాహమవుతున్నారు. ముహూర్తాలు చూసుకొని ప్రమాణస్వీకారాల కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శంషాబాద్ మండలంలో 21 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. విజేలంతా నూతన ఉత్సాహంతో ఉన్నారు.

శనివారం శంషాబాద్ మండలంలోని ముచింతల్ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ సుభాష్‌తో పాటు నూతనంగా ఎన్నికైన పంచాయతీ కార్యవర్గ సభ్యులు శ్రీశ్రీ చిన్న జీయర్ ఆశ్రమంలోని స్వామీజీ కుటీరంలో స్వామిని కలిసి ఆశీస్సులు పొందారు. శ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ధర్మ పద్ధతితో ప్రజలకు అనుకూలంగా పాలన కొనసాగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెంటయ్య, చంద్రయ్య, లక్ష్మ య్య, ఉప సర్పంచ్ పాండు, కృష్ణ, శివకుమార్, ప్రభాకర్, రామకృష్ణ, శివరామకృష్ణ, యాదగిరి, రేణు బాబు, ప్రదీప్, సుమన్, నరసింహ పంతులు తోపాటు పలువురు పాల్గొన్నారు

## పిఓలు, ఎంపిడివోల వాగ్వాదం

**ధారూరు, డిసెంబరు 13, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలోని రెండో విడత స్థానిక సంస్థ ఎన్నికల సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం పిఓలు (ప్రిసైడింగ్ ఆఫీసర్) డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్దకు వచ్చి రిపోర్ట్ చేసే సమయంలో ఎంపీడీవో(అదనపు జిల్లా ఎన్నికల అథారిటీ) నరసింహులు పదే పదే సస్పెన్షన్ కోసం రిపోర్టు రాస్తానని హెచ్చరించడంతో పిఓలు తిరగబడ్డారు. ఎంపీడీవో డౌన్ డౌన్, ఎంపీడీవో ను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడే ఉన్న ఎంపీఓ షఫీ ఉల్లా ఖాన్, ఎంఇఓ కలగజేసుకుని సర్ది చెప్పారు. రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం యధావిధిగా ఎన్నికల సామాగ్రిని ఆర్ఓ, ఏఆర్ఓ, పిఓ లకు అప్పగించారు. మండల వ్యాప్తంగా 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 5 గ్రామాల్లో ఏకగ్రీవం కాగా, మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఆదివారం రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా అధికా రులు నుంచి ఎన్నికల సామాగ్రిని తీసు కొని పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. 11 రూట్ల ద్వారా పోలింగ్ స్టేషన్లకు చేరుకో నున్నారు. ఆర్డీఓ వాసుచంద్ర, ఎంపీడీఓ నరసింహులు జెండా ఊపి పంపిణీ

మిగతా 2లో

# పైసా వసూల్



**ఓటు వేయలేదు.. నోటు వాపస్ చేయండి..**

**సర్పంచ్ ఎన్నికల తర్వాత పల్లెల్లో మారిన చిత్రం..**

**ఓటు వేయని వారిని డబ్బులు వాపస్ అడుగుతున్న అభ్యర్థులు..**

**షాద్‌నగర్ నియోజక వర్గంలో అయోమయంలో ఓటర్లు..**

**షాద్‌నగర్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** వసూల్.. వసూల్.. వసూల్.. పైసా వసూల్ అంటూ నిన్నటిదాకా లక్షలు, కోట్లలో ఖర్చుపెట్టిన అభ్యర్థులు ప్రస్తుతం ఖర్చు పెట్టిన నోట్లను వాపస్ తీసుకునే పనిలో పడ్డారు. షాద్ నగర్ నియో జకవర్గంలో ఎన్నికల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు అధికంగా ఉన్న ప్రాంతాలలో అభ్యర్థులు కోట్ల రూపాయలు ఎన్నికల కోసం ఖర్చు పెట్టారు. తీరా తమ అంచనాలు తారుమారై ఓటమికి గురయ్యారు. దీంతో వార్డుల వారీగా ఎవరు తమకు ఓటు వేశారు.. ఎవరు ఓటు వేయలేదు అన్నది గుర్తించి తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఓటర్లను వెంటాడుతున్నారు. దీనితో నిన్నటిదాకా కలిసి వచ్చిన అదృష్టం అని మురిసిపోయిన ఓటర్లు ఇంతే నయా.. తెలుసుకోవయ్యా.. ఈ లోకం ఇంతేనయా.. అంటూ నిట్టూరు వస్తున్నారు. షాద్ నగర్ నియోజకవర్గం లో సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కనిపిస్తున్న దృశ్యాలు ఇవి..

**ఇలా మొదలైంది..**

షాద్‌నగర్ నియోజకవర్గం పారిశ్రామికంగా, రియల్ ఎస్టేట్ వ్యాపారాల పరంగా ఎంతో అభివృద్ధి చెందింది. దీనితో సర్పం చ్ పదవి లాభదాయంగా భావించిన అభ్యర్థులు ఆ పదవి కోసం కోట్ల రూపాయలు వెనక ముందు చూడకుండా ఖర్చు పెట్టారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటినుంచి నిత్యం ఉదయం టిఫిన్లు, పగలు రాత్రి భోజనాలు.. తమ గుర్తులతో కూడిన కానుకలు, నిత్యం జనాలకు డబ్బులు పంచుతూ నానా హంగామా చేశారు. అయితే ఎవరు ఎంత హంగామా చేసిన విజయం మాత్రం ఒక్కరినే వరుస్తుంది. అదే రీతిలో గ్రామాల వారిగా ఒక అభ్యర్థి విజయం సాధించగా, మిగతా వాళ్లంతా ఓటమిపాలయ్యారు. దీనితో తమకు ఓటు వేయకుండా ఇబ్బంది పెట్టిన వాళ్లపై కోపాన్ని పెంచుకున్నారు. తిరిగి తమ డబ్బులు రికవరీ చేసుకునే పనిలో పడ్డారు. దీనితో కల చెదిరింది.. కథ మారింది.. అన్న రీతిలో ఓటర్లకు నిట్టూ రుపులు తప్పడం లేదు.

**డిఫెన్స్‌లో ఓటర్లు..**

నిన్నటిదాకా గ్రామాల్లో ఒక పండుగ వాతావరణం నెలకొంది.. ఇంటికే వచ్చి మర్యాదలు చేయడం.. భోజనాలకు ఆహ్వానిం చడం.. ప్రచారంలో వెంట తిప్పుకోవడం.. గుర్తులు, ఇతరత్రా కానుకలు ఇవ్వడం.. ప్రతిరోజు ఇంటికి డబ్బులు పంపించడం.. ఇలా రకరకాలుగా ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాన్ని అభ్యర్థులు చేశారు.

తీరా ఓటమిని చవి చూడడంతో ఆగ్రహానికి గురైన అభ్యర్థులు తమ డబ్బులు తమకు ఇవ్వాలని వెంట పడడం మొదలుపెట్టారు. కొందుర్గు మండలంలో తాజాగా ఇలాంటి సంఘటన వెలుగు చూడగా, పలుచోట్ల అభ్యర్థులు ఇలాగే ఓటర్ల వెంటపడి డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ వేధిస్తున్నట్లు సమాచారం. ఖర్చు అయిపోయిన డబ్బులను తిరిగి ఎలా ఇవ్వాలని ఓటర్లు మదన పడుతున్నారు. ఈ సమస్య ఎవరికీ చెప్పుకోలేం.. అలాగే ఆగ్రహంతో ఉన్న అభ్యర్థులను సద్దిపుచ్చలేం.. ఇప్పుడు ఏం చేయాలి.. అంటూ ఓటర్లు అయోమయంలో పడ్డారు. ఈ ఎన్నికలు చాలా హాట్ గురూ.. అంటూ నిట్టూర్చడం ఓటర్ల వంతు అవుతుంది. నిజాయితీగా వేయాల్సి న ఓటుకు డబ్బులు ఆశిస్తే దాని పర్యవసానం ఎలా ఉంటుందో ఇప్పుడు ఓటర్లు ప్రత్యక్షంగా చర్చిస్తున్నారు.

## ప్రమాణ స్వీకారం కాకుండానే ఇంత పెత్తనమా!

**ఎస్.బిపల్లిలో పచ్చని చెట్లు నరికివేత**

**కలెక్టర్, ఎంపిడివో, పంచాయతీ సెక్రటరీకి ఫిర్యాదు చేసిన ఉప సర్పంచ్ సున్నాల గణేష్, వార్డ్ సభ్యులు**

**కొత్తూరు :** పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటుతుంటే.. మరోవైపు కొందరు వ్యక్తులు రోడ్లపక్క ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికేస్తున్నారు. ఉప సర్పంచ్ సున్నాల గణేష్, వార్డ్ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తూరు మండలంలోని ఎస్ బి పల్లి గ్రామంలో రోడ్డుపై ఇరువైపులా నాటిన చెట్లను సర్పంచ్ సుమిత్ర మల్లారెడ్డి ఇంటికి అడ్డుగా ఉన్నాయని కూలీలతో కలిసి నరికి వేయించారు. దీంతో సర్పంచ్ గా ఎన్నికైన మొదటి రోజు ప్రకృతిని నాశనం చేశారనీ గ్రామస్తులు స్థానికులు బాధ వ్యక్తం చేస్తున్నారు. పది ఏళ్ల క్రితం నాటిన చెట్లను కట్ చేయడంతో ఈ దృశ్యాలు చూసి జనాల హృదయాలు కలిసి వేస్తున్నాయి. వారు చెట్లను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గెలిచిన రెండు రోజులకే చెట్లను నరికారని ఉపసర్పంచ్ సున్నాల గణేష్, వార్డు సభ్యులతో కలిసి వాట్సాప్ ద్వారా కలెక్టర్, జిల్లా సీఈవో, ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి కి ఫోన్ చేసి అడగగా ముందుగా ఎలాంటి అనుమతులు తీసుకోలేదని చెప్పిందని తర్వాత ఇంటికి అడ్డుగా ఉన్నాయని వాటిని నరుకుతున్నానని గతంలో ఓసారి చెప్పాడని కార్యదర్శి చెప్పినట్లు ఉపసర్పంచ్ గణేష్ చెప్పారు.



చెట్లు నరికివేయించిన దృశ్యం

## సాంకేతిక నైపుణ్యాలతో ఉపాధి కల్పన

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**పరిగి రూరల్ డిసెంబర్ 13ప్రభాతవార్త :** పరిగి మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో45 కోట్లతో నిర్మించబోతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్కు శంకు స్థాపన చేసిన రాష్ట్ర గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామి , మరియు ఎమ్మెల్యే డా టి రామ్మోహన్ రెడ్డి ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూసాంకేతిక నైపుణ్యత పెంచి ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వంఅడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్( ఐటిఐ) ఏర్పాటు లక్ష్యం ఈ ప్రాంత విద్యార్థులకు టెక్నాలజీకి సంబంధించిన కోర్సులు అందించాలి, మరి యు ఉపాధి కల్పించాలని ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కళాశాలలను ప్రతి నియో జకవర్గంలో ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా 45 కోట్ల రూపాయలతో పరిగి నియోజకవర్గానికి సంబంధించినటువంటి ఏటీపీ నస్కల్ వద్ద నిర్మిస్తున్నామని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో 200 మందికి శిక్షణ ఇచ్చి అందరికి ఉద్యోగాలు కల్పిస్తామని పెద్ద కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు చేస్తుందని రెండు ఎకరాలలో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ భవనంలో అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉంచుతామని విద్యార్థులు నైపుణ్య కోర్సులు నేర్చుకున్న తర్వాత మన పరిగి కి సమీపంలో నిర్మిస్తున్న లగచర్ల పారిశ్రామిక వాడల్లో పనిచేయుటకు కూడా ఉపాధి అవకాశాలు కలుగుతాయని భవిష్యత్తులో నైపుణ్యత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని కావున ఇలాంటి కళాశాలలో

మిగతా 2లో



అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

# అభివృద్ధికి పట్టం

**-ఇండస్ట్రియల్ కారిడార్, ఎడ్యుకేషనల్ హబ్ గ్రామాల్లో కాంగ్రెస్ హవా..**

**-లగచర్ల హకీంపేట్ పోలేపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు..**

**-రోటిబండ తండాలో బిఆర్ఎస్ అభ్యర్థి విజయం..**

**దుద్యాల్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండ తండా గ్రామాల్లో భూ సేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం వచ్చిన కలెక్టర్, ఇతర అధికారులపై రైతులు, గ్రామస్తుల..దాడి, నిరసన నేపథ్యంలో లగచర్ల పేరు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం పాఠకులకు విధితమే. భూ సేకరణ ప్రభావిత గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలలో ఎదురు దెబ్బ తగులుతుందని అందరూ భావించారు. కానీ ఎడ్యుకేషనల్ హబ్, ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి ప నులు వేగవంతంగా సాగుతూ ఉండడంతో ప్రభావిత గ్రామాల ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారు. భూ బాధితులకు త్వరితగతిన పరిహారం అందడం, వెంటనే ప్లాట్లు అందించడానికి ప నులు వేగవంతంగా సాగడం, ఎడ్యుకేషనల్ హబ్ లో భాగంగా వివిధ విద్యాసంస్థల భవన నిర్మాణ ప నులకు శంకుస్థాపనలు చేయడంతో అభివృద్ధి వేగంగా జరుగుతుందని భావించిన ప్రభావిత గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు లగచర్ల గ్రామంలో వెంకట్ రాములు గౌడ్, పోలేపల్లి లో జింకలి చంద్రయ్య యాదవ్, హకీంపేట్ లో రవీంద్ర నరసింహారెడ్డి 423 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. రోటిబండ తండాలో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి రుక్కమ్మ గెలుపొందారు.. హకీంపేట్ లో గెలుపొందిన రవీంద్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కొడంగల్ ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. హకీంపేట్ ఎడ్యుకేషనల్ హబ్‌గా ఏర్పాటు చేయుటకు నే ం కూడా గ్రామ సర్పంచిగా భాగస్వామిని అయ్యేందుకు తోడ్పాటు అందించిన హకీంపేట్ గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిఆర్ఎస్ సర్పంచ్‌లకు నో ఎంట్రీ

**ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిరాకరణ - అభివృద్ధికి సహకరిస్తామని హామీ**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరు సెగ్మెంట్లో కొంతమంది కొత్త సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరేందుకు ఉత్సుకత చూపిస్తున్నారు. బీఆర్ఎస్ మద్ధతుతో కొంతమంది సర్పంచ్‌లు మధ్యవర్తుల ద్వారా రాయబారం నడిపినట్లు తెలిసింది. అయితే, అందుకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ఆయన సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి నిరాకరించినట్లు పార్టీవర్గాల సమాచారం. పార్టీ ఫిరాయింపుదారుల వల్ల కాంగ్రెస్ శ్రేణుల మనోభావాలు దెబ్బతింటాయని స్పష్టం చేసినట్లు తెలిసింది. అగ్రనేతలు తీసుకున్న నిర్ణయానికి రాయబారం నడిపిన నాయకులు నిరాశకు గురయ్యారు. తాండూరు నియోజకవర్గంలో 100 పైచిలుకు జీపీలను కాంగ్రెస్ మద్ధతుదారులు గెలుపొందగా, బీఆర్ఎస్ తరపున 50 పైగా గెలుచుకున్నారు. వారిలో 11 మంది బీఆర్ఎస్ సర్పంచ్‌లు కాంగ్రెస్ వైపు తొంగి చూస్తున్నారు. ఇదే అదనుగా భావించి ఎమ్మెల్యే వద్ద మార్కులు కొట్టేయాలని చూస్తున్న నాయకులకు చుక్కెదురైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మనోహర్‌రెడ్డి విజయం కోసం పని చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త వారి రాకను తీవ్రంగా వ్యతిరేకించారు. యాలాల, బషీరాబాద్, తాండూరు టౌన్,

మిగతా 2లో



సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## ఎమ్మెల్యేను కలిసిన నూతన సర్పంచులు

**జిల్లేడు చౌదరి గూడెం, డిసెంబరు 13, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నూతన సర్పంచులు శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో 24గ్రామ పంచాయతీలకు మొదటి విడత సర్పంచి ఎన్నికలు ఈనెల 11వ తేదీన జరిగాయి. 24 గ్రామపంచాయతీలలో 14 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందారు. గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎంతో కీలకంగా పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజుతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనురాగ్ యూనివర్శిటీ ఇంజినీరింగ్ విద్యార్థుల పరిశ్రమల సందర్శన

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 13, ప్రభాత వార్త:** పరిశ్రమల సందర్శనతో ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఫ్యాక్టరీ మేనేజర్ టి. రాజమహేందర్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్



అనురాగ్ యూనివర్శిటీ ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమల సందర్శనలో భాగంగా కిర్బి బిల్డింగ్ సిస్టమ్స్ ఫ్యాక్టరీని సందర్శించిన దృశ్యం

యూనివర్శిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు శనివారం పాశమైలా రంలోని కిర్బీ బిల్డింగ్ సిస్టమ్స్ అండ్ స్ట్రక్చర్స్ ఇండియా ప్రవేటు లిమిటెడ్‌ను సందర్శించారు. మెకానికల్‌లోని తర్మిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పరిశ్రమను సందర్శించారు. సేఫ్టీఆఫీసర్ ఎస్‌విడి. విజయ్‌కుమార్, ఇంజినీర్ మహేశ్‌లు విద్యార్థులకు వివిధ భవన నిర్మాణ విడిభాగాల తయారీ పద్దతులు వివిధ రకాలైన వెల్డింగ్ పద్దతులు, నాణ్యత ప్రమాణాలపై ప్రయోజిత అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్శనలో ఫ్యాక్టరీ మేనేజర్ రాజమహేందర్ విద్యార్థులు పలు విలువైన సూచనలు చేశారు. ఆడ్మిన్ సాయిబాబా, అధ్యాపకులు జి. అరుణ్‌రెడ్డి, కె. సందీప్ కుమార్, ఎం. మహేశ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డి గూడ గ్రామ వార్డు సభ్యులను సన్మానించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**కేశంపేట, డిసెంబరు 13, ప్రభాత వార్త:** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో బిఆర్‌ఎస్ పార్టీ నుండి వార్డు సభ్యులుగా గెలుపొందిన వారిని ఘనంగా సన్మానించిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన వార్డు సభ్యులు కసబ్ జ్యోతి నరేందర్ జి,తాండ్ర జ్యోతి నరేందర్ రెడ్డి,అబ్బి శీను,అబ్బి అశ్విని రామకృష్ణ,ఎం.స్వప్న



ప్రవీణ్,కె.చిన్న నాయక్,మాజీ సర్పంచ్ పల్లటి లక్ష్మీ మనారాయణ, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రామచందర్ తదితరులు తదితరులను శనివారం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నివా సంలో మర్యాదపూర్వకంగా కలిశారు.సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు మరియు మాజీ ప్రజా ప్రతినిధులకు బిఆర్‌ఎస్ నాయకులకు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రీతం, మల్లేశ్ ప్రచారం

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 13, ప్రభాత వార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీచేస్తున్న అభ్యర్థులను గెలి పించాలని రాష్ట్ర ఎస్‌సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం కోరారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్‌తో కలిసి రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని చల్లంపల్లి, కడ్తాల్ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు, మద్దతు దారులతో కలిసి వారు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో భూపరిరక్షణ రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, ఘట్‌కేసర్ కాంగ్రెస్ ఎస్‌సీ సెల్ అధ్యక్షులు మోత్కుపల్లి శ్రీనివాస్, కడుపొల్ల రాజు, గంగారం రాజులు పాల్గొన్నారు.



ఎస్‌సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌తో కలిసి ప్రచారం చేస్తున్న మాజీ కౌన్సిలర్ మల్లేశ్

## గ్రామాల అభివృద్ధికి ఆధారం కాంగ్రెస్

**షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి**

**షాద్‌నగర్, డిసెంబరు 13, ప్రభాత వార్త:** గ్రామాల అభివృద్ధికి ఆధారం కాంగ్రెస్ పార్టీ అని గ్రామ స్వరాజ్యానికి మూలాధారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కేశంపేట మండలం తొమ్మిది రేకుల సర్పంచ్ కవితా కరుణాకర్, నిర్ధవెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్, బోదునం పల్లి సర్పంచ్ నాగేశ్వర్, మంగలి గూడ గ్రామ సర్పంచ్ నరేందర్ రెడ్డి, పాటిగడ్డ గ్రామ సర్పంచు శ్యామల అఖిల్ లు శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిని శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా నూతన సర్పంచులుగా ఎన్నికైన వారిని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కూడా శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిపోయిందని గత సర్కార్ చేసిన అనేక తప్పిదాల వల్ల గ్రామాల్లో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నోచుకోక ఎంతో మంది సర్పంచులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలు ఉన్నాయని గత ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ లో ప్రజా పాలన చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఆపకుండా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని ప్రజలకు కావలసిన పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారని ఇది ప్రజా ప్రభుత్వమని ఆయన అన్నారు. నూతన సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేసే దిశగా ముందడుగు వేయాలని ప్రభుత్వం వారి అండగా నిలబడుతుందని అనేక గ్రామాలకు తన మద్దతు ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిచిన ప్రతిచోట గ్రామ అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతుందని అన్నారు.



నూతన సర్పంచులతో మాజీ ఎమ్మెల్యే

## అధికారులు ఎన్నికల నిబంధనల మేరకు పని చేయాలి

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

**మోమిన్‌పేట్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను సూచించారు. శనివారం మోమిన్‌పేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు ఉద్యోగులతో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల పూర్తి నమ్మకంతో, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అధికారులు స్వతంత్రనిర్ణయాలతో కాకుండా ఎన్నికల నిబంధనల మేరకు పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నత అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే చాలామంది గతంలో జరిగిన ఎన్నికల్లో విధులు నిర్వహించారని, అట్టి అ నుభవంతో ఎన్నికల పారదర్శకంగా, ఎలాంటి భయము లేకుండా నిర్భయంగా విధుల నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. రిటర్నింగ్ అధికారులు తమకు ఉన్న పూర్తి అధికారాలతో ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ వాసు చంద్ర, నోడల్ అధికారి సదానందం, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో సృజన సాహిత్య, ఎంఇఓ మల్లేశం, ఎంపిఓ యాదగిరి, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.



ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## కొలువుదీరిన కొత్త సర్పంచ్‌లు

**కేశంపేట, డిసెంబరు 13, ప్రభాతవార్త :** మొదటి విడత ఎన్నికల్లో కేశంపేట మండల పరిధిలోని 29 గ్రామపంచాయతీలో కొలువుదీరిన కొత్త సర్పంచులు మెజారిటీలవారీగా 1.కేశంపేట మండలంలో స్వతంత్ర అభ్యర్థి అత్యధికంగా 1,009 ఓట్లతో బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ లు ఘన విజయం సాధించారు. 2.కొండారెడ్డిపల్లి గ్రామా నికి చెందిన పల్లె ఆనంద్ కుమార్ విజయం సాధించారు. 3.అల్వాలలో లంకాల సురేష్ రెడ్డి(173) ఓట్లు, 4. బైర్ఖాన్ పల్లి బైకని శమంత(204), 5.బొదునంపల్లి ఎదిరే నాగేష్ 19), 6.చింతకుంటపల్లి పోచమోని రమేష్ (49), 7.చౌలపల్లి వజ్రమ్మ(228), 8.దత్తాయపల్లి మామిడిపల్లి భాస్కర్(80),9. ఎక్లాస్ ఖాన్ పెట ఎల్లనమోని హరిశేఖర్ యాదవ్(446), 10.ఇప్పలపల్లి మంద మంజుల(73), 11.కాకునూర్ బుడోళ్ల రాజు(9), 12.కొనాయపల్లి సొప్పరి ధనలక్ష్మి మ్మ రామకృష్ణ ముదిరాజ్. (105), 13.కొత్తపేట పట్లూరి హైమావతి(192), 14.లేమామిడి దిద్దెల సులోచన(529). 15.లింగంధన నాగిళ్ల వెంకటయ్య(161), 16.మంగళగూడ కొట్ట నరేందర్ రెడ్డి (35), 17.నిర్దవెల్లి చెదురువెల్లి భాస్కర్ గౌడ్ (252), 18.పాపిరెడ్డిగూడ చాకలి శశి రేఖ(186), 19.పాటిగడ్డ శ్యామల అ ఖిలేష్ (23),20. పోల్కొని గుట్టతాండ రాత్లావత్ భాస్కర్(11), 21.పోమాల్ పల్లి బి. స్వప్న భూపాల్ రెడ్డి(25), 22.పుట్లోనిగూడ కాట్రావత్ చప్లి భాస్కర్(172), 23.సంగెం వేణుగో పాల్(99) 24.సంతాపూర్ బర్కం యాదయ్య(98), 25.సుందరాపురం నేనా వత్ భారతి రవీందర్ (62), 26.తొమ్మిదిరేకుల బీస కవితాకరుణాకర్ రెడ్డి(123), 28.తూర్పుగడ్డతండా, కేతావత్ తౌర్య(15), 28.వేములనర్వ పల్లె మోని సువర్ణ చిన్న నర్సింలు ముదిరాజ్ (271) ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 29.దేవునిగుడితండాలో పాతులవత్ సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## పాటిగడ్డని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

**షాద్‌నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" పాటిగడ్డ సర్పంచ్ శ్యామల అఖిల్‌ను అభినందించిన ఎమ్మెల్యే**

**షాద్‌నగర్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** పాటిగడ్డ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని గ్రామంలో ఏ సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలని పూర్తిస్థాయిలో గ్రామ అభివృద్ధికి సహ కరిస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలం పాటిగడ్డ గ్రామ సర్పంచిగా సంచలన విజయం సాధించిన నవ యువకుడు శ్యామల అ ఖిల్‌ను ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ అభినందించారు. సర్పంచ్‌గా గెలిచాక మర్యాదపూర్వకంగా శ్యామల అ ఖిల్ ఆయనను కలుసుకోవడానికి ఆయన స్వగృహానికి గ్రామ పెద్దలతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా అఖిల్ ను చూసి ఎమ్మెల్యే ముచ్చట పడ్డారు. చిన్న వయసులోనే పాతికేళ్ల వయసులో గ్రామ సర్పంచ్ గా సంచలన విజయం సాధించి కాంగ్రెస్ గౌరవాన్ని నిలబెట్టినందుకు ఆయనను ప్రత్యేకంగా భుజం తట్టి అభినందించారు. గ్రామ అభివృద్ధి బాధ్యత తనదని హామీ ఇచ్చారు. గ్రామానికి వచ్చే చోట కాలువపై వంతెన నిర్మాణం చేయాలని సర్పంచ్ శ్యామల అఖిల్ ఎమ్మెల్యేను కోరగా వెంటనే వాటి పనులను పూర్తి చేయిస్తానని అంతేకాకుండా గ్రామ పంచాయతీ భవనం నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. ఏ అభివృద్ధి ప్రణాళికలు ఉన్న వెంటనే అమలు జరిగేలా అధికారులతో మాట్లాడతానని నవయుకుడిగా గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత శ్యామల అఖిల్ పై ఉందని సూచించారు.రాజకీయాలకు అతీతంగా క్రమపాలన అందించాలని ఎమ్మెల్యే అఖిల్ కు సూచించారు. చిన్న వయసులో రాజకీయాల్లోకి రావడం శుభ పరిణామం ఆయన అభినందించారు. అనంతరం సర్పంచ్ శ్యామల అఖిల్ ను కండువాతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాటిగడ్డ గ్రామ పెద్దలు పాటిగడ్డ సర్పంచ్ అఖిల్ పాపిరెడ్డి, ఆరోగ్య రెడ్డి, సంసన్ రెడ్డి, జయరాజ్ రెడ్డి, నవీన్ రెడ్డి, రమేష్, రవి, సంజీవ్, భాను, సురేష్, గోపి, పరమేశ్వర తదితరులను ఎమ్మెల్యే అభినందిస్తూ ప్రత్యేకంగా సన్మానించారు.



ఎమ్మెల్యేని కలిసిన పాటిగడ్డ సర్పంచ్

## పాషపూర్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

**పెద్దేముల్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొన్న సంఘటన పెద్దేముల్ మండలంలోని పాషపూర్‌లో చోటు చేసుకుంది. పాషపూర్‌లో శుక్రవారం రాత్రి ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. శనివారం తాండూరు రూరల్ సిఐ ప్రవీన్‌కుమార్ రెడ్డి, పెద్దేముల్ ఎస్ఐ శంకర్ పర్యవేక్షణలో ఇరు వర్గాలకు సంబందించిన వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు.ప్రతి వర్గం నుంచి శాంతి భద్రతలు పాటిస్తామని, ఎలాంటి శాంతి భంగం జరగకుండాముందస్తుగా రెండు వర్గాల వ్యక్తులను మండల రెవిన్యు అధికారి ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సిఐ ప్రవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ భవిషత్తులోఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఇరువర్గాలు సంమయనం పాటించాలని అన్నారు. బాండ్ నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైన ఉపేక్షించ బోమని అన్నారు.ఒక వేళ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సిఐ ప్రవీన్ కుమార్ రెడ్డి

## వేముల నర్వ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కేశంపేట, డిసెంబరు 13, ప్రభాత వార్త:** వేముల నర్వ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన సువర్ణ చిన్న నరసింహా ముదిరాజ్, ఉప సర్పంచ్ రమేష్ నాయక్, వార్డు సభ్యులను శనివారం షాద్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో పూల బొకే శాలువాతో ఘనంగా సన్మానించిన, శుభా కాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యేశంకర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని గ్రామంలో ఎలాంటి సమస్యలు దృష్టికి వచ్చిన వెంట నే వాటిని పరిష్కరించాలని కేశంపేట మండలంలోని వేములన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, గ్రామాన్ని అభివృద్ధి చేసేం దుకు ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కటిక మంజుల మల్లేష్, ఆనంద్ రెడ్డి, మల్లేష్, మల్లయ్య, కృష్ణయ్య, చిర్ర శీను, వడ్డే మహేష్, శ్రీకాంత్ గమనించిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్

**శుభాకాంక్షలు తెలిపిన యాదవ సంఘం నాయకులు రఘునాథ్ యాదవ్**

**కేశంపేట, డిసెంబరు 13, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందిన కేశంపేట మండల కేంద్రానికి చెందిన బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ ను షాద్‌నగర్ యాదవ సంఘం నాయకులు రఘునాథ్ యాదవ్ శాలువా పూల బొకేలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొజ్జం సంతోషం శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ కేశంపేట ప్రజలు నాపై నమ్మకంతో నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు అని తెలిపారు. ప్రజలకు విధేయుడుగా ఉండి అందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని సంతోషా శ్రీశైలం యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కేశంపేట తాజా మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి, తోపాటు షాద్ నగర్ నియోజకవర్గం యాదవ సంఘం నాయకులు యన్. రఘునాథ్ యాదవ్, తోపాటు మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, అశోక్ యాదవ్ పాల్గొని నూతన సర్పంచ్ ను అభినందించారు.గ్రామ అభివృద్ధికి కలిసి పనిచేయాలని అందరి మన్నాళ్లు పొందాలని సూచనలు చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్యవైశ్య సర్పంచులకు సన్మానం



ఆర్యవైశ్య సర్పంచులను సన్మానిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, డిసెంబరు 13, ప్రభాత వార్త:** ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘాల షాద్‌నగర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం కొత్తూరు మండలం గూడూరు సర్పంచ్ గా ఎన్నికైన ఉప్పల దయానంద్ గుప్తా, ఫరూక్‌నగర్ మండలం భీమారం గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన ఎలుకుర్తి గీత వీరేశం గుప్తాను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పట్టణ అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస గుప్తా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయం సాధించిన సర్పంచులను శాలువా జ్ఞాపికతో సన్మానించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేసి సమాజంలో మంచి గుర్తింపు సాధించి మరిన్ని పదవులు ఆశించాలని ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు సర్పంచులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం షాద్ నగర్ కార్యదర్శి గందే శంకర్ కోశాధికారి పోల శశిధర్, మాజీ అధ్యక్షులు యంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, తాటి విజయ్ కుమార్, ఉప్పల శివ, దండు రామ్మోహన్, అవోపా రంగారెడ్డి జిల్లా సౌత్ శాఖ అధ్యక్షులు తాటి రామచంద్రుడు ఆవోప జిల్లా కార్యదర్శి జి బాల రాజేష్, కోశాధికారి గుడిపల్లి వెంకటరమణ, రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యులు పెండ్యాల జగదీశ్వర్ , అవోపా జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పెండ్యాల నీరజ, కార్యదర్శి తాటి సుమలత, వాసవి క్లబ్ అధ్యక్షులు కల్వ మాణిక్యం, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలత, ఆయా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## దినేష్‌ను దారుణంగా కొట్టడం బాధాకరం

**బిఆర్‌ఎస్ షాద్‌నగర్ పట్టణ మహిళా నాయకురాలు ఉమాదేవి**

**షాద్‌నగర్, డిసెంబరు 13, ప్రభాత వార్త:** బిఆర్‌ఎస్ పార్టీలో నాయకులు కార్యకర్తలు అందరూ సమానమని పెద్ద నాయకులు కార్యకర్తలను తమ బిడ్డల్లా భావించాలని ఒక కుటుంబ సభ్యులుగా ఆదరించాల్సిన వారు ఇలా విచక్షణారహితంగా దాడులు జరిపితే ఎలా అని బిఆర్‌ఎస్ షాద్ నగర్ పట్టణ మహిళా నాయకురాలు ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేటలో సర్పంచ్ అభ్యర్థి పశువుల ప్రవీణ్ పై దాడి దౌర్జన్యం చేస్తున్నారన్న సమాచారంతో అతనికి అండగా నిలిచి పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లడానికి అండగా నిలిచేందుకు వెళుతున్న షాద్ నగర్ బిఆర్‌ఎస్ నాయకులు దినేష్ సాగర్, మధుసూదన్ రెడ్డి, సుధీర్ లపై స్థానిక బిఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ రవి యాదవ్, మురళి యాదవ్ తదితర అనుచరులు చేసిన దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా తప్పు జరిగితే ఒకవేళ పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, నిరభ్యంతరంగా పోలీసులకు పట్టించవచ్చని కానీ చట్టాన్ని చేతిలలోకి తీసుకొని విచక్షణారహితంగా దాడులు జరిపి వాహనాలను ధ్వంసం చేయడం లాంటి చర్యలు సమంజసం కాదని ఆమె తెలిపారు. మన పార్టీకి చెందిన వాళ్లు అన్న కనీస అభిమానం ప్రేమ లేకపోతే ఎలా అని ఆమె ప్రశ్నించారు. గత ఎన్నికల్లో దినేష్ తదితర యువకులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య తరఫున ప్రచారం చేశారని వారికి ఎంతగానో మేలు చేశారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. పార్టీలోని కార్యకర్తలు నాయకులు అందరూ ఒక కుటుంబ సభ్యుల లాంటి వారని ఏం జరిగిందో తెలుసుకోకుండా దాడులకు దిగడం అనాగరిక చర్య అని ఆమె స్పష్టం చేశారు. పోలీసు వాహనంలో రక్షణగా కూర్చోబెట్టినప్పటికీ వాహనంలోకి ప్రవేశించి కూడా దినేష్‌పై జరిగిన దాడికి తను ఎంతగానో బాధ పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని సదర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓపై కూడా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ దాడిలో ఒకవేళ యువనాయకుల ప్రాణాలు పోయి ఉంటే ఏం జరిగేది? అని ఒకసారి ఆలోచించుకోవాలని ఆమె హితవు పలికారు. మనలో మనమే కొట్టుకుని చస్తుంటే ఇతర పార్టీ వాళ్లకు లోకువ కామ రాజకీయాల్లో అసలు ఉండాల్సిన లక్షణం ఇది కాదని ఎవరైనా సరే దాడులకు పాల్పడేవారు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని ఆమె కోరారు.



ఉమాదేవి



రూ.2 లక్షల నగదు అందజేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

## కోర్టు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి రూ.2 లక్షలు

**ఘట్‌కేసర్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** మేడిపల్లిలో నిర్మిస్తున్న జిల్లా న్యాయస్థాన భవనానికి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి రూ.2 లక్షలు అందించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు శనివారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి మల్లారెడ్డిని కలిసి కోర్టు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే రూ.2 లక్షల నగదును ఘట్‌కేసర్ న్యాయవాదులకు అందజేశారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు కొమ్మిడి రాఘవరెడ్డి, పాలడుగు అమరేందర్‌రెడ్డి, కొమ్మిడి అనురాధరెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, మొల్గురం ధన్‌రాజ్, ప్రశోబ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్‌ను కలిసిన సిడితండ సర్పంచ్ గబ్రు చౌహాన్

## ఎమ్మెల్యేను కలిసిన సిడితండా సర్పంచ్

**నందిగామ, డిసెంబరు 13, ప్రభాత వార్త:** నందిగామ మండలం సిడి తండా సర్పంచ్ గా గెలుపొందిన గబ్రు చౌహాన్ ట్రబుల్ షూటర్స్ గా పేరొందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చెవులపల్లి ప్రతాప్ రెడ్డి, ఉమ్మడి మండలాల మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డిలను కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ సంక్షేమ పథకాలే అత్యధిక గ్రామాల్లో సర్పంచులు గెలుపొందారని అన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని,కాంగ్రెస్ ప్రజా పాలనలో.. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసి ఉత్తమ సర్పంచిగా రాణించాలని ఆయన కోరారు.

## 16 నుంచి ఎదులాబాద్‌లో ధనుర్మాస ఉత్సవాలు

**ఘట్‌కేసర్, డిసెంబరు 13, ప్రభాత వార్త:** జిహెచ్‌ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేతమన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్స వాలు జరుగనున్నాయి. ఆలయంలో ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో ధర్మకర్తలు తగిన ఏర్పాట్లు చేస్తు న్నారు. ఈనెల 16న ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 30న వైకుంఠ ఏకాదశి ఉత్తర ప్రవేశద్వారా భక్తులకు స్వామి దర్శనం, జనవరి 11న కుడారై ఉత్సవం, 12న అధ్యయన ఉత్సవం ప్రారంభం, 15న ఉదయం 10 గంటలకు గోదాకళ్యాణోత్సవం, 16న సాయంత్రం 7 గంటలకు అభిషేకం (నోము) తదితర పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ధనుర్మాస సందర్భంగా ఆలయంలో నిత్యం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసేందుకు ధర్మకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఎన్నికలకు రంగంసిద్ధం



సిబ్బంది కేటాయింపును పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారి, ఆమనగల్లు ఎంపిడిఓ కుసుమ మాధురి



బ్యాలెట్ పేపర్లు గ్రామ పంచాయతీలకు తీసుకువెళుతున్న ఎన్నికల అధికారులు



ఎన్నికల విధులను సరి చేసుకుంటున్న ఎన్నికల అధికారులు



బ్యాలెట్ బాక్సులను ఎన్నికల అధికారులకు అందజేస్తున్న దృశ్యం



గ్రామాలకు ఎన్నికల సామాగ్రిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



ఎన్నికల అధికారులకు సంబంధిత పంచాయతీల ఎన్నికల పేపర్లను అందజేస్తున్న చేవెళ్ల మండల ఎన్నికల అధికారి ఎంపిడిఓ హిమబిందు

## పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు
## ఎన్నికల నిర్వహణ అధికారులు, భద్రతా బలగాలు
## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
## చేవెళ్ళ ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్ కుమార్




**మొయినాబాద్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** రెండోవిడుత స్థానిక సర్పంచ్ ఎన్నికలకు మొయినాబాద్ మండలంలో 19 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరుగనున్నాయి, మొయినాబాద్‌లో జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి సంధ్య చేవెళ్ళ ఆర్డీవో చంద్రకళ మొయినాబాద్ మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఎన్నికల పర్యవేక్షణలో పాల్గొని రేపటి ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. మండల కేంద్రంలో నుండి మొయినాబాద్‌లో 19 పంచాయితీలకు ఎన్నికలు జరుగుతుండగా పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను, తరలించి, ఎన్నికల నిర్వహణ అధికారులను భద్రతా బలగాలను గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. ఆదివారం పోలింగ్ కొరకు సామాగ్రి బ్యాలెట్ పేపర్లు, ఇంకింగ్ ప్యాడ్‌లు ఇతర సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రత ఏర్పాట్లును పటిష్టం చేశారు. సిసి కెమెరాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రత కోసం పోలీసుల కేంద్రాలకు చేరారు. ఆదివారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఓటు వినియోగించు కోవాలన్నారు. సమయం ఒంటిగంట దాటితే ఓటు వేయడానికి అనుమతించరని, ముందస్తుగా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒంటిగంట తరువాత మధ్యాహ్న భోజనానికి గంట సమయం తరువాత 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభిస్తారని అన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలన్నారు.

### ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో ఎన్నికలు

**-పోలింగ్ స్టేషన్లకు తరలిన సామాగ్రి, సిబ్బంది**
**-ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్**
**-పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు**

**ఆమనగల్లు, డిసెంబరు13, ప్రభాతవార్త:** రెండవ విడత పంచాయతీ ఎన్నికలు నేడు జరగనున్నాయి. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాలో పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాలో మొత్తం 70 సర్పంచు, 594 వార్డుల స్థానాలు ఉన్నాయి. వీటిలో 6 సర్పంచు స్థానాలు, 121 వార్డులు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యాయి. ఆమనగల్లులో 13 పంచాయతీలకు గాను కోనాపూర్ పంచాయతీ సర్పంచు పదవితోపాటు మొత్తం 20 వార్డుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. తలకొండపల్లి మండలంలో 32 పంచాయతీలకు గాను రెండు సర్పంచు స్థానాలు బల్సులపల్లి, కోరింతతండా పంచాయతీలు, పలు పంచాయతీలలో 52 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే కడ్తాల మండలంలో 24 పంచాయతీలు ఉండగా అందులో మూడు పంచాయతీలు రేఖ్యతండా, గడ్డిమీదితండా, గోవిందాయిపల్లి తండాల సర్పంచు స్థానాలు, పలు పంచాయతీలో 49 వార్డుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆమనగల్లు మండలంలో జరిగే 12 పంచాయతీల సర్పంచుల పదవులకు 41 మంది అభ్యర్థులు, 13పంచాయతీలకు చెందిన 112 వార్డుల స్థానాల్లో 20 వార్డులు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి మిగతా 92 వార్డులకు 279 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కడ్తాల మండలంలో 24 పంచాయతీలకు గాను నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా 20 పంచాయతీల సర్పంచు స్థానాలకు 63 మంది అభ్యర్థులు, 210 వార్డులకు గాను 52 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 158 వార్డులకు 453 మంది పోటీ పడుతున్నారు. అలాగే తలకొండపల్లి మండలంలో 32 పంచాయతీలకు గాను 3 సర్పంచుల పదవులు ఏకగ్రీవమయ్యాయి. అంతేకాకుండా 272 వార్డుల స్థానాలకు గాను 49 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 223 వార్డులకు 616 మంది బరిలో ఉన్నారు. నేడు జరిగే ఎన్నికలకు కావాలసిన ఏర్పాట్లను అధికారులు సర్వం సిద్దం చేశారు. పోలింగ్‌కు కావలసిన బ్యాలెట్‌బ్యాక్సులు, సామాగ్రి, సిబ్బందిని కేటాయించి ఆయా కేంద్రాలకు ఒకరోజు ముందుగానే తరలించారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికల అధికారులు సమయం కేటాయించారు. ఆమనగల్లు మండలంలో మండల పరిధిలోని 13 పంచాయతీలకుగాను కోనాపూర్ సర్పంచు పదవి, 112 వార్డుల స్థానాలకుగాను 20 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 12 పంచాయతీలు మంగళపల్లి, చింతలపల్లి, శంకర్‌కొండతండా, మేడిగడ్డ, చెన్నంపల్లి, పోలెపల్లి, కొత్తకుంటతండా, సింగంపల్లి, ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, రాంనుంతల, సీతారాంనగర్‌తండాల పంచాయతీలకు ఎన్నికలు జరగ నున్నాయి. మండల వ్యాప్తంగా 14712 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 7401, పురుషులు 7311 మంది ఓటు హక్కును విని యోగించుకోనున్నారు. 112 పోలింగ్ ఆఫీసర్స్, 124 మంది ఓపిఓలు, ఇతర సిబ్బందిని ఎన్నికల అధికారులు కేటాయించారు. అలాగే మండల వ్యాప్తంగా నాలుగు పంచాయతీలను సమస్యాత్మక ప్రాంతాలుగా పోలీసులు గుర్తించి వాటిపై పోలీస్‌శాఖ ప్రత్యేకదృష్టిని కేటాయించి అదనపు భద్రతను కేటా యించారు. శెట్టిపల్లి, ఆకుతోటపల్లి, మంగళపల్లి, పోలెపల్లి గ్రామాలు సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో నమోదయ్యాయి. ఈ పంచాయతీల వద్ద వెబ్ కె మెరాలు అదనపు భద్రతను ఇవ్వనున్నాయి. కాగా శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సిబ్బంది రూట్‌మ్యాపులు, సామాగ్రిని కేటాయించారు. ఇక్కడి నుండి ఆయా కేంద్రాలకు బయలుదేరేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక వాహనాలను ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును నిర్వహించేందుకు పోలీస్‌శాఖ దాదాపు 200 మందిని కేటాయించింది. వీరితోపాటు సిఐ, ఎస్సై, ఎఎస్సైలు భద్రతను పర్యవేక్షించనున్నారు.



ఆమనగల్లు నుండి పోలింగ్ కేంద్రానికి సామాగ్రితో బయలు దేరుతున్న సిబ్బంది



కడ్తాలలో సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు




ఆమనగల్లులో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి రాజేశ్, చిత్రంలో ఎసిపి లక్ష్మీనారాయణ

**డిసిపి పర్యవేక్షణలో....**

రెండవ విడతలో భాగంగా ఆమనగల్లు మండలంలో ఆదివారం జరగనున్న పంచాయతీల ఎన్నికలను ప్రశాంతంగా, శాంతిభద్రతల మధ్య నిర్వహించేందుకు పోలీస్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. దాదాపు 200 మంది పోలీస్‌సిబ్బంది 13 పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును నిర్వహించనున్నది. శనివారం శంషాబాద్ డిసిపి రాజేశ్, షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణలు ఆమనగల్లులోని ఓఫంక్షన్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. సమావేశంలో డిసిపి రాజేశ్ పోలీస్‌సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వద్ద అవలంబించవలసిన పద్ధతులు, పలు సలహాలు, సూచనలు అందజేశారు. మండల పరిధిలోని నాలుగు సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించినందున అక్కడ నిర్వహించే బందోబస్తు గురించి ప్రత్యేకంగా వివరించారు. ఎట్టి పరిస్థితులలో కూడా శాంతిభద్రతల ఉల్లంఘించకుండా తగు విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. అలాగే సిఐ, ఎస్సైలు, ఎఎస్సైలు ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆమనగల్లు సిఐ జానకిరాంరెడ్డి, ఎస్సై బి. వెంకటేశ్‌లు తదితరులు ఉన్నారు.

### చేవెళ్ళలో 23 గ్రామ పంచాయతీ సర్పంచులకు ఎన్నికలు

**- పంచాయతీలకు చేరుకున్న ఎన్నికల అధికారులు , పోలింగ్ సామాగ్రి**
**-పకడ్బందీగా ఏర్పాట్లను చేసిన ఎన్నికల అధికారి హిమబిందు**

**చేవెళ్ల, డిసెంబరు 13, ప్రభాతవార్త :**
చేవెళ్ల మండలంలో ఈ నెల 14న ఆదివారం జరుగునున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్దం చేశారు. చేవెళ్ల మండంలోని 23 గ్రామ పంచాయతీలకు పోలింగ్ సామాగ్రి, ఎన్నికల అధికారులు చేరుకున్నారు. పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారి, చేవెళ్ల ఎంపిడిఓ హిమబిందు ఏర్పాట్లు చేశారు. చేవెళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో నుండి సర్పంచ్ ఎన్నికల సామాగ్రితో ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు శనివారం సాయంత్రం వెళ్లిపోయారు. చేవెళ్ళ రిటర్నింగ్ అధికారి పోలింగ్ సిబ్బందికి కేటాయించిన బ్యాలెట్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అందజేశారు.



ఎస్ఐ సున్నం రాఘువేందర్

చేవెళ్ళ మండలంలో రెండు జోన్‌లుగా, 8 మంది రూట్ అధికారులను నియమించారు. చేవెళ్ళ మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా, రెండు గ్రామ పంచాయతీలైన చన్‌వల్లి, మీర్జాగూడ గ్రామ పంచాయతీ సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన 23 పంచాయతీలకు సర్పంచులకు, 201 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రూట్‌లవారిగా బస్‌లను ఏర్పాటు చేశారు. చేవెళ్ళ మండలంలో 23 గ్రామ పంచాయతీ సర్పంచులకు ఎన్నికలను ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగనుంది. రెండు గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటా

**చేవెళ్ల అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ కిషన్ గౌడ్**

చేవెళ్ల మండలంలో సర్పంచ్ ఎన్నికలు సక్రమంగా నిర్వమిచేందుకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామని చేవెళ్ల అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ కిషన్ గౌడ్ తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా పోలీసుల బలగాలను ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీసు శాఖ భద్రత ఏర్పాట్లను చేసిందన్నారు. ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో మద్యం డబ్బు పంపిణీలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. చేవెళ్ల మండలంలో 23 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు జరుగుతున్న గ్రామాలల్లో 8 క్లస్టస్లుగా విభజించి పోలీసు భద్రత ఏర్పాటు చేశామన్నారు.

### పకడ్బందీగా ఎన్నికల బందోబస్తు

**ఎస్సై సున్నం రాఘవేందం**

**ధారూరు, డిసెంబరు 13, ప్రభాతవార్త:** రెండో విడత స్థానిక సంస్థ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తున్నామని ధారూర్ ఎస్సై సున్నం రాఘవేందర్ అన్నారు. ధారూర్ మండలంలో 125 పోలీసులు, ఒక డీఎస్పీ, ఒక సీఐ, 12 ఎస్సైలు, 5 ఏఎస్ఐ, 16 హెడ్ కానిస్టేబుల్, 55 కానిస్టేబుల్, 13 మహిళా కానిస్టేబుల్, 22 హోమ్ గార్డులతో బందోబస్త్ నిర్వహిస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరైన ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గెలుపొందిన అభ్యర్థులు డిజె పెట్టి ర్యాలీ తీయరాదన్నారు.



మాట్లాడుతున్న డివై ప్రసాద్

### కష్టానికి తగిన గుర్తింపు లభించింది

**..ఉపసర్పంచ్ డివై ప్రసాద్**

**పెద్దేముల్, డిసెంబరు 13, ప్రభాతవార్త:** పదేళ్ళ పాటు బిఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసినందుకు తగిన గుర్తింపు లభించిందని పెద్దేముల్ ఉపసర్పంచ్ డివై ప్రసాద్ అన్నారు. ఈ నెల 11న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన డివై ప్రసాద్ పెద్దేముల్ ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డివై ప్రసాద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో బిఆర్ఎస్ పార్టీ ముందువరుసలో ఉందని అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం మాజీ సిఎం కేసిఆర్ సర్కార్ ఎంతో కృషిచేసిందని అన్నారు. ప్రజల హృదయాలలో మాజీ సిఎం కేసిఆర్ గుర్తుండేలా నిలిచి పోయారని, రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. తనను ఉపసర్పంచ్‌గాఎన్నుకున్నందుకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ డివై నర్సిములు, వార్డు మెంబర్లు యం, ఆంజనేయులు, లక్ష్మన్ నాయక్, పి.అనురాధ,కవిత, డివై నర్సమ్మ, రవి, మండల పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



నందిగామలో దేవాలయంలో పూజలు చేసిన సర్పంచ్, వార్డు సభ్యులు

**శివ రామాంజనేయ దేవాలయంలో...**

### పూజలు చేసిన సర్పంచ్ ,ఉపసర్పంచ్ , వార్డు సభ్యులు

**నందిగామ, డిసెంబరు 13, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీ శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ ఎర్ర వెంకటేష్ గౌడ్, వార్డ్ సభ్యులు పూజలు చేశారు. ఈ పూజల్లో కాంగ్రెస్ నేత. జిల్లెల్ల బాల్ రెడ్డి , షాద్నగర్ ఎఎంసి డైరెక్టర్ సి నర్సింలు, మాజీ ఎంపిటిసి చంద్రపాల్ రెడ్డి, వార్డు సభ్యులు శివగల్ల ప్రవీణ్ , బొమ్మగల నరసింహులు, లతా శివ, మమతా సూరి, కిట్టు, అగ్గిప్రసాద్, కాంగ్రెస్ నాయకుల అడ్వకేట్ అంజి తదితరులు ఉన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో మాదే ప్రభంజనం

**..ఊహించని రీతిలో 65 స్థానాల్లో ఎగిరిన గులాబీ జెండా**
**..పలు గ్రామాల్లో రెబల్స్ లేకుంటే మరో 16 స్థానాల్లో గెలిచే అవకాశం**
**..మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్ నాయకత్వాన్ని బలంగా నమ్మిన పార్టీ క్యాడర్**
**..నాటి కేసీఆర్ సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధిని విస్మరించని ఓటర్లు**
**..రెండేళ్ల వ్యవధిలోనే బలంగా పుంజుకున్న గులాబీ పార్టీ**



అంజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే, షాద్‌నగర్



రవీందర్ యాదవ్, మాజీ ఎంపీపీ, కేశంపేట

**షాద్‌నగర్, డిసెంబరు 13, ప్రభాతవార్త :** గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో గులాబీ పార్టీ తన ప్రభంజనాన్ని సృష్టించింది. అధికార పార్టీకి ముచ్చెంటలు పట్టే విధంగా గట్టి పోటీని ఇచ్చి తన సత్తాను చాటింది. షాద్ నగర్ నియోజకవర్గంలో 153 గ్రామపంచాయతీ స్థానాలకు గాను 65 స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించి సర్పంచులుగా ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్ ల నాయకత్వంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. ఎలాగైనా నియోజకవర్గ గడ్డపై గులాబీ జెండాలు ఎగరాలనే పట్టుదల, కృషితో గెలుపు కోసం పనిచేసే తమ లక్ష్యాలను చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వ్యూహాలకు అనుగుణంగా, వై. రవీందర్ యాదవ్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు తమదైన శైలిలో ప్రత్యర్థులను ఓడించేందుకు శ్రమించి ఉత్తమ ఫలితాలను సాధించారు. అధికార పార్టీ నేతలు ఊహించని స్థాయిలో సర్పంచులుగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. షాద్ నగర్ నియోజకవర్గం అంటే బీఆర్ఎస్ పార్టీ అనే రీతిలో ఫలితాలను సాధించి గులాబీ పార్టీ తిరుగులేని శక్తిగా ఉందని విషయాన్ని చాటారు. దీనికి తోడు నాటి కేసీఆర్ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, పల్లె ప్రగతి ద్వారా జరిగిన అభివృద్ధిని గుర్తు చేసుకుని మెజార్టీ ప్రజలు గులాబీ పార్టీని బలపరిచారు. ఫరూఖ్ నగర్ మండలంలో 47 స్థానాలలో 18 మంది సర్పంచులుగా ఎన్నికై తమ సత్తాను చాటారు. కొందుర్గు మండలంలో 8, కొత్తూరు మండలంలో ముగ్గురు, నందిగామ మండలంలో 11 మంది, కేశంపేట మండలంలో 12 మంది, చౌదరిగుడా మండలంలో 13 మంది గులాబీ పార్టీ సర్పంచులుగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో మొత్తంగా కాంగ్రెస్ పార్టీకి 73 సర్పంచ్ స్థానాలు రాగ, బీఆర్ఎస్ పార్టీకి 65 స్థానాలు వచ్చాయి. సాధారణంగా అధికార పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులు ఎక్కువ గెలిచే అవకాశాలు ఉంటాయి కానీ, ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ పార్టీ మద్దతు దారులు గట్టి పోటీ ఇచ్చి, దాదాపుగా అధికార పార్టీకి దగ్గరగా సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ప్రధానంగా సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యకర్తలను జాగృతం చేయడంలో సఫలీకృతులయ్యారని క్యాడర్ భావిస్తుంది. అనుకూలంగా ఉన్న ప్రతి చోట గెలుపే లక్ష్యంగా పనిచేయడంతో గులాబీ పార్టీ ఎక్కువ స్థానాలలో గెలుపొందెందుకు మార్గం సులభమ్నైది. గ్రామీణ ప్రాంతాలలో ప్రచారాలు, సభలు, సమావేశాలు వంటి కార్యక్రమాలలో సైతం పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో పాల్గొనడం కలిసి వచ్చింది. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల ముందు తాజాగా జరిగిన సర్పంచ్ స్థానాలలో గులాబీ పార్టీ తన ప్రభంజనం సృష్టించడంతో పార్టీ క్యాడర్లో మరింత బలోపేతమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెబల్స్ బెడద లేకుంటే మరో 16 స్థానాలు బిఆర్ఎస్‌వే**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు రెబల్స్ అభ్యర్థుల బెడద లేకుంటే మరో 16 స్థానాలలో గెలిచే అవకాశాలు మెండుగా ఉండేవని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. కొందరు వ్యక్తులు తమ స్వార్థపూరిత రాజకీయాల కోసం, తమ స్వలాభం కోసం గ్రామాలలో ఆదరణ లేని నాయకులను ప్రోత్సహించి, బీఆర్ఎస్ మద్దతు దారులను ఓడించేందుకు తమ సొంత అభ్యర్థులను బరిలో దించినట్లు నాయకులు భావిస్తున్నారు. రెబల్ అభ్యర్థుల వల్ల ఓడిన, గెలిచిన అభ్యర్థులకు భారీగా ఖర్చులు పెరిగాయని, సులభంగా గెలిచే చోట రెబల్ అభ్యర్థులతో గెలుపుకు ఇబ్బందులు తలెత్తాయని పార్టీ నేతలు వాపోయారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కేశంపేట, డిసెంబరు 13, ప్రభాత వార్త:** కేశంపేట మండల కేంద్రానికి చెందిన గూడ లింగం శనివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంత్యక్రియల నిమిత్తం 5000 వేల రూపాయలను ఆర్థిక సహాయంగా గ్రామానికి నూతనంగా సర్పంచ్ గా ఎన్నికైన బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్, బిజెపి యువ నాయకుడు తలసాని పవన్ కుమార్ రెడ్డి ల ద్వారా అందజేశారు. వారితోపాటు కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ 5000, పవన్ కుమార్ రెడ్డి 3000 అందజేశారు. గొప్ప మనసుతో మా కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన విశాల శ్రవణ్ రెడ్డికి,సర్పంచ్ సంతోషా శ్రీశైలం, పవన్ కుమార్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

### కాంగ్రెస్‌తో అన్ని వర్గాలకు అభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి**

**దోమ, డిసెంబరు 13, ప్రభాత వార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందుతారనిపర్గి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం నాడు దోమ మండల పరిదిలోని గుండాల్, కొత్తపల్లి, దాదాపూర్, మల్లేపల్లి, దిర్సంపల్లి, కొండాయపల్లి, బ్రాహ్మన్‌పల్లి, బడ్లాపూర్, రాకొండ, తిమాయపల్లి, దోమ, పాలెపల్లి, మోత్కూర్ గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తరపున పోటి చేస్తున్న సర్పంచులకు మద్దతు తెలుపుతూ ప్రచారం జరిపారు. ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్‌జిల్లా కొడంగల్ నియో జక వర్గం పక్కన పర్గి దగ్గర ఉన్నందున ముఖ్యమంత్రి ప్రత్యేక నిదులు కోటాయించడము జరుగుతందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగు తందని తెలిపారు. గ్రామములో అభివృద్ధి జరగాలంటే అందుబాటులో ఉండే మంచి నాయకునిణ్ణి ఎన్నుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో గుర్తులు చక్కగా గుర్తు పెట్టుకొని కాంగ్రెస్ మద్దతుదారులకు ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో గుండాల్ ప్రబాకర్‌రెడ్డి, దాదాపూర్ బసన్న, దోమరాం చంద్రారెడ్డి, మాలి శివకుమార్‌రెడ్డి, మోత్కూర్ ఆనంద్, సర్పంచ్ అభ్యర్తులు, వార్డుమెంబర్ అభ్యర్థులు, కాంగ్రెస్ కార్యకర్తలుపాల్గొన్నారు.

